ఇసుకాసుర!



గోదావరిలో అడ్డగోలుగా ఇసుక దందా

- టెండర్‌లో క్వారీ ఒక చోట.. తవ్వేది ఇంకోచోట
- మూసేసిన క్వారీలో మళ్లీ తవ్వకాలు
- లోడింగ్ చార్జీ పేరుతో లారీకి రూ.5వేలు వసూళ్లు
- ఒక్కో క్వారీలో రోజుకు రూ.10లక్షలకు పైగా వసూళ్లు
- టీఎస్ఎండీసీ నిర్వాకంతో వందల కోట్లు అక్రమార్కుల జేబుల్లోకి
- ములుగు ఏజెన్సీలో చక్రం తిప్పుతున్న అధికారపార్టీ నేత

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఇసుక తవ్వకాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. టెండర్లు వేసిన ఇసుక క్వారీల్లో కాకుండా, మరో క్వారీలో ఇసుక తవ్వుతూ కాంట్రాక్టర్లు అక్రమాలకు తెర లేపుతున్నారు. తమకు కేటాయించిన క్వారీల్లో ఇసుక నిల్వలు లేవని, మరో క్వారీ నుంచి ఇసుకను తవ్వుకునేందుకు అనుమతి ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగిందే తడవుగా టీఎస్ఎండీసీ అధికారులు అనధికారికంగా అప్పనంగా అనుతులు ఇస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అదనపు బకెట్, బల్క్ సరఫరాతో క్వారీల్లోని ఇసుకను ఖాళీ చేసిన ఇసుకాసురులు మళ్లీ కొత్త క్వారీలను ఆక్రమించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీల్లో సుమారు రూ.200 కోట్లకు పైగా విలువైన ఇసుకను అక్రమార్కులు దోచుకుంటున్నారనే టాక్ వినబడుతోంది.

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంతా..

ప్రభుత్వం మారినా ఇసుకాసురుల అక్రమ దందాకు మాత్రం చెక్ పడడం లేదనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు దిగుతున్నారు. ములుగు జిల్లాలో 10 ఇసుక క్వారీలు, భూపాలపల్లి జిల్లాలో ఐదు ఇసుక క్వారీలు ఉన్నాయి. అయితే ఇసుక క్వారీల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి.. అక్రమ మార్గాన ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేటాయించిన క్వారీలో కాకుండా మరో క్వారీలో ఇసుకను తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బోదపూర్-2 ఇసుక క్వారీలో సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నాయి. పక్కనే ఉన్న రామన్నగూడెం ఇసుక క్వారీలో ఉన్న లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక దాదాపు విక్రయించారు. అయితే బోదాపూర్-2 క్వారీకి కేటాయించిన ఇసుక లారీలకు రామన్నగూడెం వద్ద ఇసుకను తరలిస్తున్నారు. బోదాపూర్-2 వే బిల్లులతో వచ్చే లారీలకు రామన్నగూడెం క్వారీ వద్ద ఇసుకను లోడ్ చేయడం ఏమిటని స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక క్వాంటిటీ రామన్నగూడెం వద్ద పూర్తి కావడంతో అక్రమంగా బోదాపూర్-2 క్వారీ వే బిల్లులకు ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ కీలక నాయకుడు అండదండలతో అక్రమ ఇసుక దందాకు దిగుతున్నారనే (మిగతా 7లో..)

మహదేవ్‌పూర్ క్వారీ వద్ద ఇసుక డంపింగ్ (ఫైల్)



లారీకి బోదాపూర్-2 క్వారీ వద్ద ఇసుక కేటాయించిన టీఎస్ఎండీసీ వే బిల్లు

లోడింగ్ పేరుతో రూ.200కోట్లు స్వాహా..?

ఇసుకాసురుల అక్రమ దందాకు అంతు లేకుండా పోతుంది. అదనపు బకెట్, బల్క్ ఇసుక దందాకు అలవాటు పడిన అక్రమార్కులు లోడింగ్ చార్జీ పేరుతో భారీగా వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఒక మెట్రిక్ టన్నుకు రూ.375 వసూలు చేస్తుంది. 5 శాతం జీఎస్టీతో పాటు రోడ్డు డ్యామేజీ మెయింటనెన్స్ పేరుతో లారీకి రూ.300 వసూలు చేస్తుంది. 16 టైర్ల లారీలో 35 మెట్రిక్ టన్నుల ఇసుకకు రూ.13,500 వరకు ప్రభుత్వానికి డీడీ రూపంలో ఇసుక కొనుగోలుదారులు చెల్లిస్తారు. ఈ మొత్తానికే లారీలో ఇసుక నింపి పంపించాల్సి ఉంటుంది. అయితే ఇసుకాసురులు అక్రమ దందాకు దిగుతున్నారు. ఇసుక లోడింగ్ పేరుతో ఒక్కొక్క లారీ రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే కాంటా పేరుతో లారీ రూ.200లు వసూళ్లు చేస్తున్నారు. ప్రతిరోజూ ములుగు జిల్లాలో ఒక్కొక్క క్వారీకి 100 నుంచి 250 లారీల వరకు ఇసుక తీసుకెళ్లేందుకు లారీలు వస్తున్నాయి. సుమారు 200 లారీలకు లెక్కేసుకున్నా.. లారీకి రూ.5 వేల చొప్పున రోజుకు రూ.10 లక్షల అక్రమ సంపాదన ఇసుకాసురుల జేబుల్లోకి చేరుతుందనే ప్రచారం జరుగుతోంది. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుకకు డిమాండ్ ఉన్న సమయంలో ప్రతిరోజూ కోటి రూపాయలకు పైగా లోడింగ్ చార్జీల పేరుతో వసూళ్లకు దిగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ ఏడాది లోడింగ్ చార్జీల పేరుతో సుమారు రూ.200 కోట్లకు పైగా అక్రమార్కులు దోచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బోదాపూర్-2 క్వారీ వే బిల్లు లారీకి రామన్నగూడెం క్వారీ వద్ద ఇసుక లోడింగ్



చివరకు మార్చురీకే చేరాడు..

బతికుండగానే తరలించిన ఘటనలోని వ్యక్తి మృతి



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎల్డి రాజు

నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో బతికున్న వ్యక్తిని చనిపోయాడని భావించి మార్చురీకి తరలించిన సిబ్బంది.. తర్వాత నాలిక్కరుచుకొని చికిత్స కోసం ఆస్పత్రి వార్డుకు తరలించిన ఘటన విదితమే. అయితే అనారోగ్యం విషమించడంతో ఆ వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రాణాలు విడిచాడు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నిండుప్రాణం బలైందనే విమర్శలు వస్తున్నాయి. స్థానికులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎల్డి రాజు(48) గత నెల 27న అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా ఆస్పత్రిలో చికిత్స తీసుకునేందుకు వచ్చాడు. ఇతను ఒంటరి వ్యక్తి. తనవద్ద ఆ సమయంలో ఆధార్‌కార్డు లేకపోవడంతో వైద్యసిబ్బంది ఆస్పత్రిలో చేర్చుకోలేదు. దీంతో అతను మూడు రోజులుగా అక్కడే పడిగాపులు కాసి, అచేతన స్థితికి చేరాడు. దీంతో అతడు చనిపోయాడని భావించి సిబ్బంది కొందరు అతడిని మార్చురీకి తరలించారు. మరుసటి రోజున అతడిలో కదలికలు కనిపించడంతో అవాక్కయి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో రాజు అనారోగ్యం విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి సోదరుడు, సోదరి ఉన్నారు. వారు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

మహబూబాబాద్ ఆస్పత్రిలో ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్ డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో మార్చురీలో ఉన్న ఎల్డి రాజు మృతదేహాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజు మృతి ఘటనకు కారకులైన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 89 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు ఇస్తారని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం మార్గం చూపాలని సూచించారు. గ్రీవెన్స్ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించి గ్రీవెన్స్‌పై ప్రజలకున్న నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, మరియన్న, రాజయ్య, దక్షిణమూర్తి, నర్సింహామూర్తి, దేశీరాంనాయక్, కృష్ణవేణి, విజయ, సురేష్, రజిత, విజయనిర్మల, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, యాదగిరి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా సందడి

- ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 జిమ్నాస్టిక్స్, జూడో ఎంపికలు పూర్తి

7

ఇంట్లోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

నాంచారి మడూరులో మహిళ మృతి



నాంచారి మడూర్‌లో ఇంట్లోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ



లక్ష్మి మృతదేహం

తొర్రూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి గ్రానైట్ లారీ దూసుకెళ్లి ఒకరు మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరులో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి కాకినాడ వైపు లోడ్‌తో వెళ్తున్న గ్రానైట్ లారీ సోమవారం నాంచారి మడూర్ రాగానే అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇల్లును ఢీకొట్టడంతో ఇల్లు కూలిపోయింది. ఈ క్రమంలో ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న తాడూరు లక్ష్మి(70) పైన ఇల్లు పక్కనే ఉన్న సెంట్రింగ్ బాక్సులు పడి తీవ్ర గాయాలపాలయింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. మహిళ మృతికి కారణమైన గ్రానైట్‌లారీ నెంబర్ టీఎస్02యూఎ0909 నడుపుతున్న డ్రైవర్ ఎమ్డీ.నవాబ్‌పై మృతురాలి బంధువు కర్రె నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. జాతీయ రహదారిపై గ్రానైట్‌లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

మురికిపాలిటీ..!

- శివారు కాలనీల్లో బురదమయంగా రోడ్లు
- మోకాలు లోతులో నిలుస్తున్న నీరు
- 30 ఏళ్లుగా గోస పడుతున్న పేదలు
- ప్రత్యేక నిధులు కేటాయించాలంటున్న ప్రజలు

మానుకోటలో వర్షం వస్తే కష్టమే..



ఆర్టీసీ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు(ఫైల్)



మహబూబాబాద్ బస్టాండ్ సమీపంలో గుంతలమయమైన రోడ్డు (ఫైల్)



మహబూబాబాద్ ఎల్‌బీజీనగర్‌లో మోకాళ్ల లోతు నిలిచిన నీరు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రం రోడ్లన్ని బురదమయంగా మారడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా వృద్ధి చెందిన మానుకోట పట్టణంలో వర్షం కురిస్తే కష్టతరంగా మారుతోంది. వర్షకాలం వస్తుందంటే శివారు కాలనీల ప్రజల గుండెల్లో భయాందోళన మొదలవుతోంది. సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ కాల్వలు సరిగా లేకపోవడంతో రోడ్లు బురదమయంగా మారడం, మురికినీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో దుర్భర జీవితం గడుపుతున్నారు. రోజు రోజుకు మహబూబాబాద్ పట్టణం విస్తారంగా పెరిగిపోతోంది. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మానుకోట మునిసిపాలిటీగా, జిల్లా కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పనులు, ఉద్యోగ రీత్యా ఇక్కడకు వచ్చిన వారంతా స్థిరపడి ఇళ్లు నిర్మించుకు స్థిరపడడంతో పట్టణం చుట్టూరా నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించింది. అంతే కాకుండా శివార్లలో కాలనీలు అనేకంగా వెలిశాయి. అందుకు తగ్గట్టుగా మౌళిక వసతులు కల్పించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం వస్తే తప్పని తిప్పలు..

మానుకోట పట్టణంలో వర్షం కురిస్తే శివారు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భావించాక ప్రధాన రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జంక్షన్‌ల అభివృద్ధి జరిగింది. ఇక పట్టణంలోని పలు వీధులతో పాటు శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో అంతర్గత రోడ్లు అంతంత మాత్రంగానే ఉండడం, కొన్ని చోట్ల సైడ్ డ్రైనేజీ కాల్వలు నిర్మించకపోవడంతో వర్షపు నీరు, ఇళ్లలోని మురికి నీరు సైతం రోడ్లపైకి వచ్చి బురదమయంగా మారడం, దోమలు వ్యాప్తి చెందడం తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. శివారు కాలనీలోని ప్రజలకు బయటకు రావాలంటే బురదలో నుంచి నడిచి రావాల్సిన దైన్యస్థితి నెలకొంది. కొన్ని కాలనీల్లో మోకాళ్లలోతు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. జిల్లా కేంద్రం శివార్లలో ఉన్నప్పటికి ఎక్కడో మారుమూల పల్లెలో ఉన్నట్లుగా వారు జీవనం కొనసాగిస్తున్నారు. ఎన్ఎన్‌నగర్, మాణిక్యనగర్, చేగువేరాకాలనీ, ఏఎల్‌నగర్, గుండ్లకుంటకాలనీ, దర్మన్నకాలనీ, తలారి వెంకటేశ్వర్లుకాలనీ, కన్నన్ననగర్, దాసరి నాగభూషణరావు, సింగు నర్సయ్య తదితర కాలనీల్లో మౌళిక వసతులు అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

మౌళికవసతులకు నోచుకోని కాలనీలు..

జిల్లా కేంద్రానికి ఆనుకొని సుమారు 60 కాలనీలకు పైగానే (మిగతా 8లో..)

కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



● రావుల రాజు, సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి, మానుకోట

జిల్లా కేంద్రం శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. వర్షం పడితే చాలు రోడ్లన్ని బురదమయంగా మారడంతో ఆ దారి గుండా పిల్లలు నుంచి మొదలకుని వృద్ధుల వరకు నడుచుకుంటూ బయటకు రావాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి.

యూరియా బస్తాల కష్టాలు ఎప్పటికి తీరునో..



నర్సింహులపేట రైతు వేదిక వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా బస్తాల కొరత రైతులను వెంబడిస్తున్నది. అధికారుల నిర్లక్ష్యంతో నెలల తరబడి రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదనడానికి సోమవారం నర్సింహులపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా బస్తాల కోసం వందలాది మంది రైతులు క్యూలైన్‌లో బారులు తీరడం విశేషం. ఇప్పటికైనా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బొడ్డితండలో వైద్య శిబిరం

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముంగిమడుగు ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని బొడ్డితండలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ మమత పర్యవేక్షణలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ ఎం.మమత మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉండే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు ముత్యం, రజిత, రసూల్‌బీ, ఉమ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పరామర్శ



మాజీ మంత్రి హరీశ్‌రావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

మరిపెడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా, హరీశ్‌రావును మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ సోమవారం హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణరావు చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు, బీఆర్ఎస్ నేతలు అచ్యుత్‌రావు, శ్రీనివాస్‌రావు, గుగులోత్ వెంకన్న, రాంబాబు, రవీందర్, సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్, రాంపెల్లి రవి, దిగిజర్ల శ్రీనివాస్, రాంసింగ్, అయూబ్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి



సోమాని

పెద్దవంగర, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని పోచారం గ్రామ శివారు భద్రుతండాలో చోటు చేసుకుంది. స్థానిక, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామశివారు భద్రుతండాకు చెందిన దారవత్ సోమాని(41) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన కూతురు వివాహం కోసం చేసిన అప్పులు, వ్యవసాయం కోసం తీసుకొచ్చిన అప్పులు పెరగడంతో బాధతో తీవ్ర మనస్థాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో వ్యవసాయ పనుల కోసం తీసుకొచ్చిన పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె కుమారుడు ఉన్నారు. దీనిపై ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వెంటనే కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని ఎస్సై తెలిపారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు



కౌసల్యదేవిపల్లిలో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీవ్రతతో పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి వినయ్ కుమార్ అన్నారు. మండలంలోని నర్సింహులపేట, ముంగిమడుగు, కౌసల్యదేవిపల్లి, కొమ్ములవంచ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొంథా తుఫాన్ తీవ్రతతో మండలంలో చేతికి అందివచ్చిన వరి నేలవాలి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నర్సింహులపేట, ముంగిమడుగు, కౌసల్యదేవిపల్లి, పడమటిగూడెం గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 80 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. పత్తి, మిర్చి పంటల నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని, వారి ఆదేశాల మేరకు పంట నష్టాన్ని గుర్తిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు కళ్యాణి, మౌనిక, రైతులు చల్ల మధూకర్‌రెడ్డి, సత్యం, వెంకన్న, కృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

మరిపెడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మరిపెడ బంగ్లాలోని సీతారాంపూర్ పీఎస్ స్కూల్ విద్యార్థులకు 135 జతల షూ వితరణ చేసి మరిపెడ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ఉపాధ్యాయులు, తల్లితండ్రులు సీఐకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ స్కూల్ విద్యార్థులు కొందరు కాళ్లకు చెప్పులు లేకుండా స్కూల్‌కు రావడాన్ని గుర్తించిన సీఐ సోమవారం ఆ పాఠశాల విద్యార్థులందరికీ తన సొంత ఖర్చులతో 135 జతల షూ కొనుగోలు చేసి అందచేశారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ దాతృత్వంపై విద్యార్థులు మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అర్జున్, మహేశ్‌గౌడ్, సందీప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు అందించాలి

తొర్రూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతుల వివరాల నివేదికలను ఆయా శాఖల అధికారులు వెంటనే అందించాలని వ్యవసాయశాఖ ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి విజయచందర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సంబంధిత అధికారులు సర్వే చేపట్టి వరి, పత్తి, ఇతర పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి గ్రామాల వారీగా హెక్టార్లు తదితర వివరాలను ఈ నెల 4వ తేదీ సాయంత్రం లోగా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ నర్సయ్య, మునిసిపల్ కమిషనర్ శ్యాం సుందర్, ఏవో రాంనర్సయ్య పాల్గొన్నారు.

వైద్యాధికారి నిర్లక్ష్యంతో గేదె మృతి

తొర్రూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పశు వైద్యాధికారుల నిర్లక్ష్యంతో గేదె మృతి చెందిన సంఘటన సోమవారం తొర్రూరులో చోటు చేసుకుంది. మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన రైతు బచ్చలి సోమయ్యకు చెందిన పసి దున్నకు అకస్మాత్తుగా జబ్బు రావడంతో తొర్రూరులోని పశు వైద్యశాలకు మధ్యాహ్న సమయంలో తీసుకురాగా, వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో కంపౌండర్ చికిత్స కోసం డాక్టర్‌కు ఫోన్ చేసి మందులు తీసుకుని చికిత్స అందించేలోపే దున్న మృతి చెందింది. పశు వైద్యాధికారి సమయానికి ఆసుపత్రిలో లేకపోవడం వల్లే దున్న మృతి చెందిందని సుమారు రూ.25వేల విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారని సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై పశు వైద్యాధికారిని వివరణ కోరగా మొబైల్‌లో అందుబాటులోకి రాలేదు.

నీటి పాలైన వరి పంట

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం రాత్రి చిన్నగూడూరు మండలంలో కురిసిన అకాల వర్షానికి జయ్యారం రెవెన్యూ పరిధి మేఘ్యాతండాకు చెందిన రైతులు వరి పంట నీటి పాలై అపార నష్టానికి గురయ్యారు. ఆ తండాకు చెందిన బాదావత్ చిరంజీవి తదితర రైతుల చేతికందిన వరి పంట నీట మునుగడంతో త ల్లడిల్లుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

చెస్ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారుడిని సన్మానిస్తున్న మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

తొర్రూర్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందరంగంలో (చెస్) అత్యంత ప్రతిభను చూపెడుతున్న విద్యార్థులను మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరపతి రెడ్డి కొనియాడారు. సోమవారం మండలంలోని గోపాలగిరిలో ఆయన మాట్లాడారు. గోపాలగిరికి చెందిన నరేష్ కుమార్-రజిత దంపతుల కుమార్తెలు దస్విక, దిలీషా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ చెస్‌లో ప్రతిభ చూపెడుతున్నారు. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడీఈ)లో చెస్ పోటీలలో ప్రతిభను కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆర్థికసాయం చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అనుమాండ్ల మాధవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి తాను ముందుటానని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దేవరకొండ శ్రీనివాస్, అనుమాండ్ల ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పుష్పిత ఎంపిక



పంజా పుష్పిత

మరిపెడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మరిపెడబంగ్లాలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని పంజా పుష్పిత ఎంపికైనట్లు ఆ గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎస్జీఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్ 14 విభాగపు పోటీలు ఈ నెల 1న డోర్నకల్ బిషప్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించగా పుష్పిత అత్యంత ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 3వ తేది నుంచి వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని ఆ స్కూల్ పీఈటీ భవానీసంత్ తెలిపారు. ఆ విద్యార్థిని తల్లితండ్రులు శ్రీకాంత్-రమాదేవిలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాంత్ చిల్లంచర్ల హైస్కూల్ పీఈటీగా పనిచేస్తున్నారు. పుష్పితను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు రాష్ట్ర పోటీలలో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చాలని అభినందించారు.

సమష్టిపోరుకు బీసీలు సిద్ధం కావాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

తొర్రూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రిజర్వేషన్ల సాధన కోసం సమష్టి పోరాటం చేసేందుకు బీసీ నేతలు సిద్ధం కావాలని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం 9వ షెడ్యూల్‌లో బీసీలను చేర్చి 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్య, ఉద్యోగ అవకాశాల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులు బీసీలకు దక్కడం లేదని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రిజర్వేషన్లు అమలు చేసేవరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కొత్తూరి రమేశ్, కొండ్లె యాకయ్య, డి.శ్రీను, అల్ల బాబు, సుధాకర్, మధు, సోమలింగం, సత్యం, రాములు తదితరులు ఉన్నారు.

నేత్రదానం మరొకరికి ప్రాణదానం



నేత్రాలు సేకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తొర్రూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం మరొకరికి ప్రాణదానం అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్నపు రాం నర్సయ్య అన్నారు. సోమవా రం తొర్రూరులో బైరు యాదగిరి అను వ్యక్తి మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరి నేత్రదానం ద్వారా మరో ఇద్దరు చూపును పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వజినపల్లి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ప్రతాపని వెంకటేశ్వర్లు, శంకర్, సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ముత్యాలమ్మగూడెంలో ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి

నెహ్రూసెంటర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ముత్యాలమ్మగూడెం ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని వ్యక్తిగత కారణాలతో మూడురోజుల క్రితం వసతిగృహంలో కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తాగింది. ఈ విషయాన్ని గమనించిన హాస్టల్ సిబ్బంది వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సనందిస్తున్నారు. ఈ విషయంపై హెచ్ఎం కోటేశ్వరిని వివరణ కోరగా విద్యార్థిని తన వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని అన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో మందులు మేలు



హోమియో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

నెహ్రూసెంటర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దుష్ఫలితాలు లేని హోమియోపతి మందులను ప్రజలు ఆదరించాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భూక్య రవిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్వాడీ భవన్‌లో సోమవారం ఆయూష్ ఆధ్వర్యంలో హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ వర్గాల ప్రజల ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించి అనేక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహి స్తుందన్నారు. దీర్ఘకాలిక రోగాలపై మంచి ఫలితాలనిచ్చే హోమియో మందులను ప్రజలు ఆదరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆయూష్ జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, వైద్యులు శ్రీకాంత్, మాధవి, రామకృష్ణ, చైతన్య, మమత, ప్రీతి, శ్రీయ, వంశీ, శ్రావణ్, మేరీ, దీవెన, పద్మ, వీరన్న పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం..

జిల్లా కేంద్రంలో బాలికోన్నత పాఠశాలలో ఆయూష్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మితమైన ఆహారం తీసుకోవాలని, నిత్యం యోగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాధవి, రామకృష్ణ, శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, రజియా, రంజాన్, అలీ, పద్మ, కౌసల్య, రమేష్, విజయలక్ష్మి, మహేశ్వరి పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

మహబూబాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. హైదరాబాద్ నుంచి మత్స్యశాఖపై జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. రూ.122 కోట్లు ఖర్చుచేసి 83కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను 26,357 నీటి వనరులలో పంపిణిచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. చేపపిల్లల పంపిణీ ఇప్పటికే ఆలస్యమైందని నవంబరు 20 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు చేప, రొయ్య పిల్లల పంపిణీని పూర్తి చేయాలన్నారు. చేపపిల్లల పంపిణీ అనేక జిల్లాలు వెనుకబడి పోయాయని జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలన్నారు. టీ-మ త్స్యయాప్ ఎలో చేపపిల్లల వివరాలు, రవాణా చేసే వాహనం , సంపూర్ణ వివరాలను మత్స్య శాఖ అధికారులు నమోదు చేయాలన్నారు. చేపల విడుదల సమాచారం సంబంధిత మత్స్యకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు అందించాలన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు శివప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

డోర్నకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. బాలురు, బాలికల విభాగంలో వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి పోటీలకు వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలికల 44 కేజీల విభాగంలో స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన భగీత, సుహానితప్ప, అభిరేశ్వరి, 48 కేజీల విభాగంలో సహస్ర, ఊహ విజిత, పవిత్ర, 53 కేజీల విభాగంలో తనుశ్రీ, అర్చన, అనూష, 58 కేజీల విభాగంలో అర్చన, వర్షిత, తనూజ, 63 కేజీల విభాగంలో అంజలి, నందిని, పవిత్ర, 69 కేజీల విభాగంలో హరిత, శ్రీ అక్షర, సోను, 77 కేజీల విభాగంలో సంయుక్త, సర్వేశ్వరి, హాసిని, తోసిని, కీర్తన, శృతిలు ఎంపికయ్యారు. బాలుర 56 కేజీల విభాగంలో నందకిశోర్, అభిలాష్, విష్ణు, 60 కేజీల విభాగంలో సిద్ధూ, ఎస్‌కె. రియాజ్, అబ్దుల్ అహ్మద్, 65 కేజీల విభాగంలో దీపక్, వీరేష్, రాజు, 71 కేజీల విభాగంలో ధనూష్, వినీత్, జూనియజాస్పర్, 79 కేజీల విభాగంలో ముజీబ్, అస్రిద్ దివాకర్, జిష్ణు, 88 కేజీల విభాగంలో శరత్‌చంద్ర, సాయిశ్రీనాథ్, మల్లేష్, 98 కేజీల విభాగంలో నౌషిక్, భానుప్రసాద్, పూర్ణ, 98 కేజీల విభాగంలో అభిషేక్, మోహిత్, యశ్వంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం తరుపున ఈ నెల 26 నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మండలోజు సుధాకర్, కార్యదర్శి కొత్త రాంబాబు, జడ్పీ హైస్కూల్ పీఈటీ కొండ్ర రవికుమార్, సీనియర్ వెయిట్ లిఫ్టర్ మండలోజు కృష్ణమూర్తి, శ్రీనివాస్‌లు తెలిపారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి మార్కింగ్

కేసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో నూతనంగా చేపట్టే రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణానికి అడ్డుగా ఉన్న రైల్వే టెలికాం, ఎలక్ట్రికల్ కేబుళ్లను తొలగించేందుకు సోమవారం సంబంధిత అధికారులు మార్కింగ్ వేశారు. అండర్ బ్రిడ్జికి కేటాయించిన వెడల్పు, లోతులో భూమిలోపల అడ్డుగా ఉన్న రైల్వే శాఖకు సంబంధించిన టెలికాం, విద్యుత్ వైర్లను తొలగించి ఆర్‌యూబీ నిర్మాణానికి అనుకూలంగా చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఈ మేరకు ఆర్‌యూబీ నిర్మాణం చేసే చోట ప్లాట్‌పాం నుంచి బయటి వరకు ముగ్గుపోసి మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌యూబీ మంజూరుకు కృషి చేసిన బీజేపీ జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, వరంగల్ ఐవోడబ్ల్యూ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ఐవోడబ్ల్యూ ఏ.వెంకట్‌రెడ్డి, టెలికాం జేఈ రూపేష్, ఎస్ఎస్ వోహెచ్ఈ రాజ్‌కుమార్, టెలికాం టెక్నీషియన్ సుమన్ పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న మిర్చి తోటలు



రాజుతండాలో దెబ్బతిన్న మిర్చి తోటను చూపిస్తున్న రైతు బాదావత్ రాజేష్

డోర్నకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు తోడుగా మొంథా తుపాన్ ప్రభావంతో డోర్నకల్ మండలంలో మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. మండల ంలో రైతులు సాగు చేసిన మిర్చి తోటలు నీట మునిగి ఊట పట్టాయని రైతులు చెబుతున్నా రు. పంట నష్ట పరిహారం అంచనా వేసేందుకు ఇప్పటివరకు ఉద్యానవనశాఖ అధికారులు ఎవరు రాలేదన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిర్చి తోటలు కళ్లముందు దెబ్బతినడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ అధికారులను పంపి పంటనష్ట వివరాలను నమోదు చేయించి పరిహారం అందించేలా కృషి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంటనష్ట పరిహారం చెల్లించాలి

డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్

కురవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని, నష్టపరిహారం ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ డిమాండ్ చేశారు. కురవి మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ తాకిడితో నష్టపోయిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం సరిపోదని, దానిని రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే అప్పుల భారంతో కుంగిపోతున్నారని, తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి శాంతికుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోతు సాయికుమార్, సూర్యప్రకాష్, శ్రీకాంత్, జవహర్, దేవేందర్, శివవర్మ, రమేష్ పాల్గొన్నారు.

యువతలో ఐక్యత పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువతలో ఐక్యతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సర్దార్ 150వ ఐక్యతా మార్చ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ అన్నారు. మహబూబాబాద్ డీపీఆర్వో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ ద్వారా పాదయాత్రలను నిర్వహించనుందని చెప్పారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా సర్దార్ 150 ఐక్యతా మార్చ్ పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఇందులో భాగంగా అక్టోబరు 31 నుంచి నవంబరు 25 వరకు జిల్లా స్థాయి పాదయాత్రలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 6 వరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన స్థలం కరంసద్ నుంచి కివాడియాలోని విగ్రహం వరకు 150 కిలోమీటర్ల మార్చ్ కొనసాగనుందన్నారు. డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, క్రీడల అధికారి జ్యోతి, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

అవిశ్రాంత నిరీక్షణ

- రిటైర్డు ఉద్యోగులకు అందని బెనిఫిట్స్
- ఒక్కొక్కరికి రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు బకాయిలు
- ఉమ్మడి జిల్లాలో 19 నెలల్లో 654 మందికి పైగా రిటైర్మెంట్
- బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందులు

హనుమకొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు తాము రిటైర్ కాగానే వచ్చే బెనిఫిట్స్‌తో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు కట్టుకోవాలనికలలు కంటారు. తన కూతుళ్లకు మంచి సంబంధాలు చూసి పెళ్లి చేయాలనుకుంటారు. కొడుకులకు ఉన్నత చదువు కోసం విదేశాలకు పంపాలనుకుంటాడు. అప్పులను తీర్చి మిగిలిన డబ్బుతో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకుంటారు. ఇవన్నీ రిటైర్డ్ ఉద్యోగులు కనే కలలు. కానీ ఆ కలలే కల్లలైతే... 38 ఏళ్లకుపైగా ఉద్యోగం చేసి రిటైర్ అయినా తర్వాత బెనిఫిట్స్ రాకపోతేఆ విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి ఏమిటీ ? ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిటైర్ అయిన విశ్రాంత ఉద్యోగులు ఇప్పుడు ఇలాంటి దయనీయ స్థితినే ఎదుర్కొంటున్నారు. 'రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వండి మహా ప్రభో...' అంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సర్కార్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో చేసేది లేక వృద్ధాప్యంలో.. నిస్సహాయ స్థితిలోరోడ్డెక్కుతున్నారు. అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టర్లకు వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను సైతం కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. అయినా పరిస్థితిలో మాత్రం మార్పు కనబడడడం లేదు. దశాబ్దాలుగా ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులను



కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు (ఫైల్)

చక్కదిద్దుకుంటూ వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగం చేస్తున్నంత కాలం జీపీఎఫ్ రూపంలో తాము కూడబెట్టుకుంటారు. రిటైర్ కాగానే అవి వెంటనే చేతికి వస్తాయని ఆశిస్తారు. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

రిటైర్ అయిన ఉద్యోగులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత 19 నెలల కాలంలో మొత్తం 654 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వరంగల్ జిల్లాలో 153, హనుమకొండ జిల్లాలో 172, జనగామ జిల్లాలో 102 మహబూబాబాద్ జిల్లాలో 97, ములుగు జిల్లాలో 60, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 70 మంది రిటైర్ అయ్యారు.

రావాల్సిన బెనిఫిట్స్

రిటైర్ అయినఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల్లో కమ్యూటేషన్ డబ్బులు రూ.7 నుంచి రూ.15 లక్ష లు, జీపీఎఫ్ రూ.10 నుంచి రూ.12 లక్షలు, గ్రాట్యు టీ రూ. 10 లక్షలు, ఫైనల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు, ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐసీ) రూ. 5 లక్షల వరకు, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం (జీఐఎస్) రూ. 20 వేల వరకు రావాల్సి ఉంది.

గత 19 నెలల్లో...

గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. వయో పరిమితి పెంపుతో రాష్ట్రంలో 2021 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉద్యోగ విరమణలు ఆగిపోయాయి. తిరిగి ప్రారంభమయ్యాక గత 19 నెలల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 654 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో హనుమకొండ జిల్లాలో 172, వరంగల్ జిల్లాలో 153, జనగామ జిల్లాలో 102, మహబూబాబాద్ జిల్లాలో 97, ములుగు జిల్లాలో 60, జయశంకర్ జిల్లాలో 70 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.3270 కోట్లు చెల్లించాల్సి ఉంది.

కోర్టు మెట్లెక్కుతున్న బాధితులు

ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో చర్చలు జరిపిన నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు కొంత మొత్తంలో జమ చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రిటైర్‌మెంట్ ప్రయోజనాల చెల్లింపు జాప్యానికి వ్యతిరేకంగా కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నగదు రహిత వైద్యసేవలు అందడం లేదని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు రావడం లేదని విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

అంతకు ముందు..

గతంలో ఉద్యోగి రిటైర్ అయిన రోజే అన్ని బెనిఫిట్స్ చేతికి అందజేసి అధికారులు వీడ్కోలు పలికేవారు. ఉద్యోగి రిటైర్ కావడానికి మూడు నెలల ముందు నుంచే ఆయనకు రావలసిన బెనిఫిట్స్ వివరాలను సేకరించి వాటిని క్లియర్ చేసేవారు. అన్ని బెనిఫిట్స్‌ను చెక్కుల రూపంలో అందజేసేవారు. రిటైర్ అయిన రోజున వీడ్కోలు సభను ఏర్పాటు చేసి అధికారులు ఆ ఉద్యోగి తన సర్వీస్ కాలంలో చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించేవారు. బెనిఫిట్స్‌ను స్వయంగా చేతికి అందజేసి వీడ్కోలు పలికేవారు. సకాలంలో బెనిఫిట్స్ చేతికి అందగానే ఆ ఉద్యోగి తన జీవిత చరమాంకాన్ని ప్రశాంతంగా గడిపేవాడు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వలేని ఆర్థిక దుస్థితిలో ఉన్నందు వల్ల ఆ పరిస్థితిని తాత్కాలికంగా గట్టేందుకు ఉద్యోగ విరమణ వయో పరిమితిని మూడేళ్లు పెంచిందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఆ మూడేళ్ల కాలం పూర్తికావడంతో ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయి రిటైర్డ్ ఉద్యోగులు ఇక్కట్ల పాలు కావలసిన దుస్థితి ఏర్పడింది.

ఆందోళనలు

తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో ప్రభుత్వం చెల్లించనందుకు నిరసనగా విశ్రాంత ఉద్యోగులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారు. అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. గత నెల 27న హనుమకొండ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

కలెక్టర్ స్నేహశబ రీష్‌కు వినతి పత్రం సమర్పించారు. బెనిఫిట్స్ అందకపోవడంతో మానసిక క్షోభకు గురై ఇప్పటి వరకు 20మంది అనారోగ్యంతో బాధపడుతూ మనోవేదనకు గురవుతూ అసువులు బాశారని రిటైర్ ఉద్యోగులు ఈ సందర్భంగా వాపోయారు. మరికొంత మంది మానసిక కృంగుబాటుకు గురై ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారన్నారు.



రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ముగిసిన క్రీడా సందడి

ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 జిమ్నాస్టిక్స్, జూడో ఎంపికలు పూర్తి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్, జూడో పోటీలు సోమవారం ముగిసాయి. జేఎన్ఎస్ లోని జిమ్నాస్టిక్స్ హాల్, డీఎస్ఏబాక్సింగ్‌హాల్‌లో అండర్-14, 17బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్, జూడో పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆ మేరకు క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి వి.ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను, మెడల్స్ ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మూడు రోజులుగా పండుగా వాతవరణంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా పోటీలు నిర్వహించమన్నారు. రాష్ట్ర స్థాయి అండర్-14, 17 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్ జూడో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఉమ్మడి పది జిల్లాల నుంచి 500మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో వెస్ట్ బెంగాల్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా అరుణాచల్ ప్రదేశ్‌లో త్వరలో నిర్వహించే జాతీయస్థాయి జూడో పోటీలకు హనుమకొండలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు, నిర్వహకులు మెడల్స్ బహుమతులను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారథి, జయశంకర్ భూపాలపల్లి డీవైఎస్‌వో రఘు, కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం. సురేష్‌బాబు, వీ. రాణి, ఎస్. శ్రీలత, జూడో అబ్జర్వర్ సత్యనారాయణ, సీనియర్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుడు వగలబోయిన శ్రీనివాస్, కోచ్‌లు నీలం సురేష్, రజిత, హరీష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్. సుభాష్, జి. రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ నెల 15న నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ పిలుపు నిచ్చారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపోండబుల్ కేసులు, సివిల్, వివాహ సంబంధిత కేసులు, మోటారు ప్రమాద క్లెయింలు, చెక్ బౌన్స్ కేసులు తదితర రాజీపడదగు కేసులు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమానికి కక్షిదారులు, పోలీసులు సహకరించాలని న్యాయమూర్తి సూచించారు. ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించడంలో మీడియా పాత్ర ప్రముఖమైందని హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. ఈ కార్యక్రమం సమాజానికి, న్యాయవ్యవస్థకు మంచిదని అభిప్రాయపడుతున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసుర..!

(5వ పేజీ తరువాయి)


ప్రచారం జరుగుతోంది. అలాగే భూపాలపల్లి జిల్లా పుస్కుపల్లి క్వారీలో 4 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను విక్రయించేందుకు టెండర్లు నిర్వహించారు. ఇటీవల వరదలకు గోదావరిలో ఇసుక క్వాంటిటీ తగ్గడంతో సదరు కాంట్రాక్టర్‌కు టీఎస్ఎండీసీ అధికారులు మహదేవపూర్ క్వారీ నుంచి ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే టీఎస్ఎండీసీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఒక క్వారీకి టెండర్ వేస్తే.. మరో క్వారీ నుంచి ఇసుకను తవ్వుకుని అమ్ముకునేలా ఎలా అనుమతి ఇస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ముందుగానే సర్వే నిర్వహించి, ఏ క్వారీలో ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయో గుర్తిస్తుంది. అంత మొత్తానికి టెండర్లు నిర్వహిస్తుంది. ఒకవేళ ప్రభుత్వం పేర్కొన్న ఇసుక నిల్వలు లేకపోయినా ఉన్న వరకే తవ్వి టీఎస్ఎండీసీకి కాంట్రాక్టరు అప్పగించాలి. కానీ, ఇతర క్వారీల్లో తవ్వుకునేందుకు ఎలాంటి అనుమతులు లేవని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

జంపన్నవాగులో ఇసుక జలగలు..

మేడారం మీదుగా గోదావరిలో కలిసే జంపన్నవాగు కూడా ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తుంది. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఈ జంపన్నవాగుపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీఎస్ఎండీసీ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదావరి ఇసుకకు డిమాండ్ ఉండడంతో ట్రాక్టర్లలో జంపన్నవాగు ఇసుకను ములుగు, జంగాలపల్లి, తాడ్వాయి పరిసర ప్రాంతాలకు తరలించి, ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా నిల్వలు చేస్తున్నారు. నిల్వలు చేసిన ప్రాంతం నుంచి లారీల్లో ఇసుకను వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఉచితంగా ఇసుకను తోడేస్తున్నారు. మేడారం స్నానఘట్టాల వద్ద కూడా ఇసుక అక్రమ దందా సాగిస్తున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ ఇసుకాసురులకు అధికార అండ ఉండడంతో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతా.. ఆ నేతల కనుసన్నల్లోనే..

ములుగు జిల్లాలో ఇసుక అక్రమ దందాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు నేతలు కీలకంగా ఉన్నారనే టాక్ వినిపిస్తుంది. పార్టీలో కీలక పదవుల్లో ఉండడంతో పాటు చాలా మంది అధికారులు సదరు నేతల సహకారంతో పోస్టింగులు పొందారు. ముఖ్యంగా పోలీస్ పోస్టింగ్‌ల్లో ఓ నేత చక్రం తిప్పుతున్నారనే చర్చ జరుగుతోంది. పోలీసులు, రెవెన్యూ సపోర్టుతో ఇసుక అక్రమ దందాలో సదరు నేతలు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా నడుస్తుందనే ప్రచారం జరుగుతోంది. సదరు నేతల బినామీలవే ఇసుక క్వారీలు, లారీలు అధికంగా ఉన్నట్లుగా సమాచారం. ఆ లారీలకు వే బిల్లులు కూడా ఉండడం లేదని, క్వారీల వద్ద ఇసుక లోడ్ చేసుకుని హైదరాబాద్, వరంగల్‌కు అక్రమంగా తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి.. ఒకటి, రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇసుక లారీలతో పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. ఇసుక క్వారీల వద్ద సామర్థ్యానికి మించి ఇసుకను లారీల్లో తరలిస్తున్నా పట్టించుకునే వారు లేరనే టాక్ వినబడుతుంది. క్వారీల వద్దే వే బ్రిడ్జిలను ఏర్పాటు చేసి, లారీల్లోని ఇసుకను తూకం వేయాల్సిన అధికారులు చేతులు కట్టుకుని కూర్చున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతా నేతల కనుసన్నల్లో ఏజెన్సీలో ఇసుక దందా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించాల్సి వస్తుందనే టాక్ వినబడుతుంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి.. ఇసుక అక్రమ దందాలను కట్టడి చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సీసీఐ చైర్మన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాసిన లేఖ

కొనుగోళ్ల పరిమితి తగ్గించిన సీసీఐ?

ఎకరాకు 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

కాటారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడులపై ప్రభావం చూపుతుందని, గతానికన్నా పత్తి కొనుగోళ్ల పరిమితిని తగ్గించింది. గతంలో ఎకరాకు 11.74 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయడానికి ప్రతిపాదించగా ఈ ఏడాది ఎకరాకు 7క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయనున్నట్లు ఆన్‌లైన్ యాప్‌లో సూచించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుకూలమైన భూమి, ఇతర పరిస్థితులు ఉన్నచోట 7 క్వింటాళ్ల కన్న అధిక దిగుబడులు వచ్చిన రైతుల పరిస్థితేమిటని ప్రశ్నిస్తున్నారు. అధిక దిగుబడులు వచ్చిన రైతులు మొదట ఎకరాకు 7క్వింటాళ్ల వరకు విక్రయించిన అనంతరం అధికారులతో కూడిన కమిటీని సంప్రదిస్తే వారు సిఫారస్ చేస్తేనే సీసీఐ కొనుగోలు చేయనుంది. మండల తహసీల్దార్ చైర్మన్, మార్కెటింగ్ కార్యదర్శి మెంబర్ కన్వీనర్, ఎస్‌హెచ్‌వో (ఎస్సై), మండల వ్యవసాయ అధికారి(ఏవో) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా పత్తి కొనుగోళ్ల పరిమితిని గతంలోలాగా ఎకరాకు 11.74క్వింటాళ్ల పరిమితి ఉంచాలని, తేమ శాతం 20వరకు అనుమతించాలని, స్టేట్ కాటన్ మిల్లర్స్, మిల్లర్స్ సమస్యలను పరిష్కరించాలని సీసీఐ చైర్మన్, సీఎండీ లలిత్‌కుమార్‌కు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నవంబరు 2న లేఖ రాశారు. 2025-2026సీజన్ పత్తి కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగిలే చూడాలని, రైతులకు ఇబ్బంది కల్గకుండా చేయాలని లేఖలో కోరారు.

మహిమాన్వితం కందగిరి క్షేత్రం

కార్తీక పౌర్ణమి వేళ హోరెత్తనున్న లక్ష్మీనర్సింహస్వామి జాతర



గర్భగుడిలో పూజలు చేస్తున్న అర్చకులు (ఫైల్)



కందగిరి పర్వతంపై ఉన్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం (ఫైల్)

కురవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి రమణీయతకు నెలవు కందగిరి. పచ్చని చెట్లు.. గుట్టలు.. ఆయుర్వేద మూలికలకు సంబంధించిన చెట్ల సువాసనలతో భక్తి పారవశ్యంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. సెలయేర్లు.. నీటి దొనలు.. లోయలు.. ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. గుట్టపైకి వచ్చే భక్తులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారనుంది. కపిలవాయి మహాముని తపస్సుచే పునీతమై శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వెలసిన కందికొండ జాతర కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 5న బుధవారం జరుగనుంది.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ శివారు కందగిరి పర్వతంపై రెండు శతాబ్దాలుగా జరుగుతున్న ఈ జాతరకు పూర్వపు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని వేలాది మంది భక్తులు విచ్చేస్తారు. ఈ గుట్టను అధిరోహించే భక్తులకు అనేక ప్రకృతి అందాలు అలరిస్తాయి. కొండపైన అసంఖ్యాకమైన పుష్కరిణి(కోనేరు) ఉన్నాయి. స్వామి పుష్కరిణి, దిగువ పుష్కరిణిలు సహా, సప్త పుష్కరిణులు ఉన్నాయి. వీటినే ఏడుదోనలు అంటారు. ఇక్కడికి ఒక పర్యాయం స్వామిని దర్శించుకొనుటకు సప్తరుషులు వచ్చి పుష్కరిణిలో స్నానం చేశారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ స్నానం చేస్తే, చర్మవ్యాదులు పోతాయని ప్రతీతి. ఇక్కడ ఉండే మధుర పుష్కరిణికి, నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు కానీ, ఇందులో నీరు కలకాలం ఉంటుంది. అంతేకాక వెదురు, దేవదారు, తింత్రిణీ వృక్షాలతో కీకారణ్యాన్ని మరిపిస్తుంది. అంతేకాక పూర్వకాలంలో యుద్ధానికి అవసరమయ్యే మందు గుండు సామాగ్రి దాచుకునేందుకు నిర్మించిన మందుల కొట్టు భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. గుర్రాల మండవ, కోటి లింగాలు ఎంతగానో ఆకర్షిస్తాయి.

క్షేత్రపురాణం..

హిరణ్యకశపుడి సంహారం అనంతరం నరసింహస్వామి లక్ష్మీదేవితో భూతలంపై సంచరిస్తూ అనేక ప్రదేశాలలో అర్చామూర్తిగా వెలుగొందారని, సంహాద్రి, వేదాద్రి, కందాద్రి(కందికొండ) మొదలగు గిరులపై కాలిడి స్వయం భువుగా వల్మీకరూపంలో వెలిశారని ఆలయ వేదపండితుడు నల్లప్రోల్ పురుషోత్తమాచార్యులు తెలిపారు. కార్తీకపౌర్ణమి నాడు నరసింహస్వామి, లక్ష్మీదేవిల వివాహానికి హాజరైతే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రతీతి ఉందని ఆయన తెలిపారు.

ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

- తేమ శాతం పేరుతో అధికారుల బ్రేక్
- అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు



సూరారంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న వరి ధాన్యపు రాశులు

ఎల్కతుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అట్టహాసంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క ధాన్యపు గింజను కొనలేదు. ఎల్కతుర్తి మండల పరిధిలో ఐకేపీ, సొసైటీల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను 10 రోజుల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు గింజ ధాన్యాన్ని కొనలేదని పలువురు రైతులు ఆగ్రహిస్తున్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని రైతులు మండిపడుతున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రతి రోజు కురుస్తున్న వర్షానికి ఆరబోసిన ధాన్యంలో సైతం తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికి రైతులు ప్రతి రోజు ధాన్యాన్ని తిరగేసి మరి తేమ శాతం లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. కాని కొనుగోలు కేంద్రం నిర్వహకులు మాత్రం ధాన్యంలో తేమ శాతం ఉంటుందంటు కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో అకాల వర్షం కురిస్తే ఇన్ని రోజులు పడిన శ్రమ వృదా కావడంతో పాటు భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో ఆరిన ధాన్యన్ని కుప్ప పోసినప్పటికి తిరిగి తేమ వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో 17 శాతం తేమ ఉన్నప్పటికి కొనుగోలు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికి కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మాత్రం 13 నుంచి 14 శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని సూచిస్తున్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ధాన్యాన్ని ఆరబోయడానికి కళ్లాలు లేక దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. సూరారం, వల్భాపూర్, కోతులనడుమ, ఎల్కతుర్తి గ్రామాలకు చెందిన కొందరు రైతులు ఎన్‌హెచ్ 563పై ధాన్యాన్ని ఆరబోయగా వర్షానికి ధాన్యం కుప్పలు కొట్టుకపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు భారీ నష్టం వాటిల్లిన వారికి ఓదార్పు కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు.

కందికొండ జాతరలో పూర్తిస్థాయి ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న వీరభద్రం

కురవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :కురవి మండలం కందికొండలో ఈ నెల 5న జరుగబోయే శ్రీ లక్ష్మినర్సింహాస్వామి జాతరకు వచ్చే భక్తుల కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం తెలిపారు. కురవి మండలం కందికొండ గుట్ట వద్ద ఎంపీ డీవో వీరబాబు, ఏఈ శ్రీనివాస్, ఏపీవో భూపాల్‌రెడ్డి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన ● మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ వినతి



క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ అంబే ద్కర్ సెంటర్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ నిర్వహి ంచి కార్యాలయ ముట్టడికి యత్నించగా పోలీ సులు అడ్డుకోవడంతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్స రాలు అవుతున్నప్పటికీ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయిం బర్సుమెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమా ండ్ చేశారు. ప్రజాపాలనలో విద్యార్థులు చదువు కోవడానికి అనేక ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు చెల్లించక పోవ డంతో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తు న్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయా లన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పవన్, రాకేష్, తాజ్, వీరేందర్, మహేష్, యాకన్న, సాగర్, ప్రవీణ్, విక్రమ్ పాల్గొన్నారు.

బీసీ జాక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

కేసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :బీసీలకు 42శాతం విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ బిల్లుల తొమ్మిదో షెడ్యూల్ చేర్చి, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా కేసముద్రం తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ జాక్, 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి బాధ్యులు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నర్సయ్య, కంచ వెంకన్న, శీలం సత్యనారాయణ, సామల వెంకటేశ్వర్లు, రామడుగు శ్రీనివాస్, సామల రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

గార్ల నవంబరు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో చదువుకొని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్న పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడికి ఆర్థిక సాయం చేశారు. గుండె జబ్బుతో బాధపడుతూ ఇటీవల ఆఅపరేషన్ చేయించుకొని ఇంట్లో విశ్రాం తి తీసుకుంటున్న దబ్బెట శ్రీను కుటుంబానికి రూ 27 ఆర్థిక సహాయం అంజేశారు. అదే విధంగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఇదే విద్యార్థులు గతంలో పలువురికి రూ 2 లక్షలు ఆర్థిక సహాయం అందించి మండలంలో ఉత్తమ విద్యార్థులుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వడ్లమూడి నాగేశ్వరరావు, చంద్రశేఖర్ గౌడ్, హనుమంతు ,గంజి రవిశంకర్, మజీద్, సునీత పాల్గొన్నారు.

చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాదద్ మునిసిపల్ పరిధి ఈదులపూసపల్లి గ్రామంలో సోమవారం గీత కార్మికుడు సమ్మెట శ్రీనివాస్ ప్రమాద వశాత్తు తాటి చెట్టుపై నుంచి జారీ పడి తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారీలాగానే కల్లు గీసేందుకు శ్రీనివాస్ తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడ్డారు. తీవ్ర గాయాలైన అతడిని 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న జిల్లా ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాస్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయ సాధన కోసం పునరంకితమవుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మండల వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలం వీఎస్, లక్ష్మీపురం గ్రామంలో అమర వీరుల సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వెంకన్న మాట్లాడుతూ.... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గుజ్జు దేవేందర్, శ్రీశైలం, హెచ్. లింగన్న,బట్టు చైతన్య, లింగయ్య, సత్యనారాయణ, సోమిరెడ్డి , కల్పన, పద్మ, సంధ్య, జ్యోతి, మౌనిక పాల్గొన్నారు.

పాత్రికేయుడికి సన్మానం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కేవీ రమణ పత్రికా రంగంలో ప్రతిభ చూపుతూ మార్గదర్శకంగా నిలుస్తున్నారని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషన్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మహబూబాబాద్‌లో మెపా ఆధ్వర్యంలో సోమవారం రమణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ముదిరాజ్ యువతకు రమణ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరుత వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్, గైరబోయిన మహేందర్ పాల్గొన్నారు.

మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని మునిసి పల్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కాంపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2006 గ్రామ పంచాయతీ హాయం నుంచి ప్రస్తుత మునిసిపాలిటీ వరకు ఔట్ సోర్సింగ్ పద్దతిలో డైలీ వేతనంతో పని చేస్తూ అనారోగ్య కారణాలతో ఐదుగురు కార్మికులు మృతి చెందారని వారి కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందించిన ఐదుగురు కార్మిక కుటుంబాల్లో ఒక్కరు చొప్పున ఐదుగురికి ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, పుచ్చకాయల ఎల్లయ్య, దాసరి మనోహర్,ఆవుల వీరన్న, ఇమ్మడి పద్మ, సైదులు, రాము, పుష్పరాజ్, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

హక్కుల పోరాట యోధుడు వల్లపు యాదగిరి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్



యాదగిరి సంతాప సభలో మాట్లాడుతున్న తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలు, ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన హక్కుల పోరాట యోధుడు వల్లపు యాదగిరి అని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. మహబూబాబాద్ ఎన్జీవోస్ కాలనీలో ప్రజా సంఘాలు, బంధుమిత్రులు ఆధ్వర్యంలో న్యాయ వాది వల్లపు యాదగిరి సంస్మరణ సభను సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య వక్తగా హాజరైన ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు. ప్రజల కోసమే జీవించి ప్రజల కోసమే తన జీవితమంటూ తన మరణం వరకు ప్రజల కోసమే పోరా డిన యోధుడు యాదగిరి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జంపాల విశ్వ, చిత్తారి సోమన్న, నారాయణ రావు, కొంపెల్లి వెంకటయ్య, సత్యనారాయణ, షైన శ్రీనివాస్, వెంకటేశ్వ ర్లు, రవి, సైదులు, విజయ్, జంపాల చక్రధర్, ప్రభాకర్‌రెడ్డి, రఘు, అయోధ్య రామయ్య, శ్రీనివాస్, చందులాల్ పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలోని ఇమాంషావలి దర్గాలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే భూక్య ముర ళీనాయక్ ప్రార్థనలు చేశారు. గ్యార్మీ షరీఫ్ పండుగను పురస్క రించుకుని దర్గాలో చాదర్‌ను సమర్పించి ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముతవల్లి షేక్, అన్వర్‌పాషా, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్, ఎమ్డీ. హరుణ్, వాహేద్, వినయ్, రజాక్, అహ్మద్, ఆరీఫ్, అసద్‌అలీఖాన్, ఖలీల్, అజీమ్, ఖదీర్, మతపెద్దలు పాల్గొన్నారు.

ఐఎంఏ వైద్యులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న బానోత్ నెహ్రూనాయక్

నెహ్రూసెంటర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర మెడికల్ అసోసి యేషన్ వార్షిక సమావేశంలో జిల్లాకు చెందిన ఐఎంఏ అధ్యక్షులు బానోత్ నెహ్రూ రాథోడ్‌కు బెస్ట్ బ్రాంచ్ అవార్డు లభించింది. గత రెండేళ్లలో ఐఎంఏ నిర్వహించిన అనేక కార్యక్రమాలను గుర్తించి రాష్ట్రశాఖ తరుపున జిల్లా శాఖకు బెస్ట్ బ్రాంచ్ అవార్డును ప్రదానం చేశారు. కాగా, జిల్లా శాఖ తరుపున బానోత్ నెహ్రూరాథోడ్ బెస్ట్‌బ్రాంచ్ అవార్డును తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ద్వారకనాథ్‌రెడ్డి, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మహబూబాబాద్ ఐఎంఏశాఖకు చెందిన మరో వైద్యులు బానోత్ రూప్‌లాల్‌కు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పదవి వరించింది. దీంతో జిల్లా వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషిచేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహ బూబాబాద్ ముని సిపల్ 17,18 వార్డుల్లో ఉన్న హిందూశ్మశాన వాటిక అభివృద్ధికి నిధు లు కేటాయిం చాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు తోట శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూ బాబా ద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. శ్మశాన వాటికలో నీటి కోసం బోరింగ్‌తో పాటు స్నానాల గదులు, నల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తోట యాకయ్య, చిగురుపాటి రమేష్‌కుమార్, ఉపేందర్ పాల్గొన్నారు. కాగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, లే లీడర్స్ జిల్లా అధ్యక్షుడు నర్రా శ్రావణ్ కోరారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమం లో మల్లెపాక తిమోతి, పాస్టర్లు సంపత్, మోతీలాల్, మంగిలాల్, రమేష్, వినోద్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించాలని మెడికల్ కళాశాల ఎదుట యజమాని ధర్నా



మెడికల్ కళాశాల ముందు ధర్నా చేస్తున్న భవన యజమాని

నెహ్రూసెంటర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మెడికల్ కళాశాల బాలికల వసతి గృహం భవన అద్దె చెల్లించాలని యజమాని కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ భవన యజమాని నెలకుర్తి రంగారెడ్డి మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయ శివారు పత్తిపాక రోడ్డులో తన ఇంటిని మెడికల్ కళాశాల బాలికల వసతి గృహానికి లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. తనకు ఏడు నెలలుగా అద్దె చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ

డోర్నకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును డోర్నకల్ మండల నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్‌తో కలిసి హరీష్‌రావును బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం సత్యనారాయణరావు చిత్రప టం వద్ద నివాళ్లర్పించారు.డోర్నకల్ పీఏసీఎస్ అధ్యక్షు డు బిక్షంరెడ్డి, ఏఎంజీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, నంజాల మధుసూదన్‌రావు, ఇం జం కృష్ణయ్య, కొత్త వీరన్న, యశోదర్‌జైన్, హేమచంద్రశేఖర్, అజిత్‌మియా, పాండునాయక్, వెంకటేశ్వర్‌రావు,ఉపేందర్ పాల్గొన్నారు.



హరీష్‌రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు



చిర్రకుంటతండాలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :నకిలీ విత్తనాలతో నష్టం వాటిల్లిందని రాములుతండ, చిర్రకుంట తండాల రైతులు మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్‌మాలిక్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్, క్రాంతిలు సోమవారం క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంట పరిశీలన, నివేదికను రాష్ట్ర ఉన్నతాధి కారులకు అందజేసి ఈ సీడ్స్‌పై పరిశోధన చేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ సహాయక సంచాల కులు మురళి, ఏవో అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి

కురవి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :తెలంగాణ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిన ధరణిని రద్దు చేసి మంచి చేసిందని, అయితే భూభారతి కొత్తచట్టం తీసుకువచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు భూ సవరణలు ప్రారంభించకపోవడం విచారకరమని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్ అన్నారు. కురవి మండలం బలపాలలో సంఘం 3వ మహాసభలో ఆయన మాట్లాడారు. పిట్టల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో రైతుసంఘం నాయకులు మలేడి కోటయ్య, నామ ఉపేందర్, జి.లక్ష్మయ్య, ఎన్.రాములు, పిట్టల ఉపేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం గ్రామ అధ్యక్షుడిగా పిట్టల మోహన్‌రావు, కార్యదర్శిగా పిట్టల ఉపేందర్‌లను ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేయాలని గార్ల మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు బండారి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ... తాను గతంలో ప్రైవేట్ లెక్చరర్‌గా పని చేసేవాడిని రెండేళ్ల కాలుకు సెప్టిక్ అయి అనారోగ్యానికి గురై అధ్యాపక వృత్తిని మాని వేసి ఇంటి వద్దనే ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు దివ్యాంగ కోటలో ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేసి ఆదుకోవాలని కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేసేందుకు కుట్ర

ఇస్లాహే మాషిరా కమిటీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో జిల్లా నిరుద్యోగులకు ఉపాధి అవకాశం లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్న అధికారులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇస్లాహే మాషిరా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల ఖాళీల భర్తీకి వరంగల్ జిల్లా న్యూశాయంపేట మండలం నుంచి అక్టోబరు 22న పేపర్ ప్రకటన ఇచ్చి రెండు రోజుల వ్యవధితోనే 24న దరఖాస్తు గడువు ఇవ్వడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లాలోని పాఠశాలల ఖాళీ పోస్టుల భర్తీకి ఇతర జిల్లాకు చెందిన ఉద్యోగులను నియమిం చుకునేందుకు ఒక పథకం ప్రకారం వేరే జిల్లాలో పేపర్ ప్రకటన ఇచ్చారని పేర్కొన్నారు. గత ఏడాది డోర్నకల్ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు నియామకంలో అవకతవకలను ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం కాగా ముస్లీం సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశామని తెలిపారు. వెంటనే ఆ అభ్యర్థిని తొలగించి నిబంధనలకు అనుగుణంగా ఎంపికైన అభ్యర్థినికి పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. ఇటీవల కాలంలో జిల్లా మైనార్టీ అధికారులు, ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్యం వలన మైనార్టీ గురుకులాల ప్రతిష్టకు భంగం కలుగుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నా సంబంధిత అధికారులు విచారణ చేపట్టక పోవడం బాధాకరమన్నారు.

మురికిపాలిటీ..!

(5వ పేజీ తరువాయి)

వెలిశాయి. సుమారు 30 నుంచి 40సంవత్సరాల మధ్య కాలంలో పట్టణ శివార్లలో కాలనీలు ఏర్పాటు కాగా నాటి నుంచి నేటి వరకు మౌళికవసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీగా డబ్బులు పెట్టి పట్టణంలో కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు శివార్లలో కొనుగోళ్లు చేసుకొని ఇళ్లు కట్టుకొని కాలనీలుగా ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. మరికొంత మంది పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని హక్కుపత్రాలు పొంది అనేక ఏళ్లుగా కాలనీల్లో నివసిస్తున్నారు. అంతర్గత రోడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం, డ్రైనేజీ సమస్యలు ఆయా కాలనీలను వెంటాడుతున్నాయి. మునిసిపల్ పరిధిలో సుమారు 12వార్డుల పరిధిలోకి కాలనీల ప్రజలు వస్తారు. అయితే ఆయా వార్డు కౌన్సిలర్లకు వచ్చిన నిధులతో కొంతమేరకు రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైనేజీ కాల్వల నిర్మాణం జరిగిందే తప్పా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని చెప్పకతప్పదు.

అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని..

జిల్లా కేంద్రంలోని శివారు కాలనీలు, మునిసిపల్ విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌళిక వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ ఇటీవల రూ.59.62 కోట్ల నిధులు మంజూరీ చేయించారు. అయితే అందులో శివారు కాలనీలు, విలీనగ్రామాల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించి మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. శివారు కాలనీల ప్రజల బాధలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

భారత జట్టు విజయంపై సంబరాలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత మహి ళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించడంతో మహబూబాబాద్ ప్రభు త్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉషోదయ వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. వాకర్స్ బాణ సంచాలు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య మాట్లాడు తూ.. భారత్ మహిళా జట్టు సభ్యులు క్రీడా స్ఫూర్తిని చాటి భారత దేశాన్ని ప్రపంచ విజేతగా నిలిపారని చెప్పారు.కాపరబో యిన శ్రీనివాస్, సోమ గోవర్ధన్, ముల్లంగి వెంకటరెడ్డి, దాసరి ప్రసాద్, నక్క నాగార్జున, సుంకరి వెంకటేశ్వర్లు, దుగ్గి రమేష్, సాదుల సురేష్, కనకయ్య, సుధాకర్, రాజేం దర్, రామస్వామి, శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న అభినందనలు

కురవి : వరల్డ్‌కప్ సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టుకు కురవి నాగార్జున విద్యాలయం విద్యార్థులు వినూత్నంగా అభినందనలు తెలిపారు. 150 మంది విద్యార్థినీ విద్యార్థులు వరల్డ్‌కప్ నమూనాతో పాటు కింద జై అని అకారంలో కూర్చోని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భూక్య రవి మాట్లాడుతూ.. భారత మహిళ జట్టు వరల్డ్‌కప్ గెలవడం గర్వకారణమని తెలిపారు.



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌గౌడ్ తదితరులు

మహబూబాబాద్ టౌన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రిజర్వేషన్ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదం తెలిపాలని బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, బీసీ, ఎస్టీ, ఎస్సీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ముంజాల రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో తహసీల్దార్ రాజేశ్వర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.....బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి కేంద్రానికి పంపి ఏడు నెలలు గడుస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. రాష్ట్ర సర్కార్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, బత్తుల కృష్ణయాదవ్, లింగాల వీరభద్రం, మంగలంపల్లి రాజు, రేపల్లే నరేష్‌కుమార్, శ్రీధర్, వెంకన్న, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● గూడూరు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని గూడూరు మండల బీసీ జేఏసీ చైర్మన్ చీర బిక్షపతి, కన్వీనర్ కట్ల విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్ నాగభవానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో కల్పించాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లు సెంబర్ 3 మరియు 4 ద్వార మార్చి 2025లో విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచుతూ ఆమోదించినట్లు చెప్పారు. ఈ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడి గత ఏడు నెలలుగా కేంద్రం వద్ద 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచి 9వ షెడ్యూల్ అమలు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ముక్తవరం సత్యనారా యణ, యాకాంబ్రం, మేరెడ్డి సురేందర్, రాసమల్ల వెంకన్న, నూకల ఉపేందర్, నూకల సురేందర్, పొడిశెట్టి సురేష్, పానుగంటి వీరస్వామి, మేరుగు మల్లయ్య, గంధసిరి రవీందర్, చేరాలు, పగిడిపాల మల్లయ్య, సంతోష్ పాల్గొన్నారు.